



ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

కడ్తాల్, ఏప్రిల్ 10 : ఎరువులు, విత్తనాల డీలర్లు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. ఈ-పాస్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. కడ్తాలలో బుధవారం డీఏవో పర్యటించి పలువురు రైతుల పంటలను పరిశీలించారు. ఏవో శ్రీలతతో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, ఫర్టిలైజర్ నిల్వలను పరిశీలించారు. ఈ-పాస్‌లో ఉన్న బ్యాలెన్స్‌తో స్టాక్ సరిపోవాలని డీలర్లకు సూచించారు. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదన్నారు. వానాకాలం సీజన్‌కు వ్యవసాయ ప్రణాళిక ను రూపొందిస్తున్నట్లు గీతారెడ్డి చెప్పారు.



ఫరూఖ్‌నగర్‌లో ఈద్గాను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు


ఆమనగల్లులో విద్యుత్ కాంతులీనుతున్న హైమదే హిలాల్ మజీద్


మార్కెట్‌లో సేమియా అమ్మకాలు

నేడు ఈద్ ఉల్ ఫితర్

- ఈద్గాల వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు
- శోభాయమానంగా మసీదుల అలంకరణ

నేడు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదులను ప్రార్థనల కోసం సిద్ధం చేశారు. రంజాన్ పండుగ ఏర్పాట్లను బుధవారం ఆయా మజీద్ కమిటీల అధ్యక్షులు, మైనార్టీ నాయకులు పరిశీలించారు. రంజాన్ నేపథ్యంలో పట్టణాల్లో ముస్లింలు వివిధ వస్తువుల కొనుగోళ్లతో బిజీగా గడిపారు. నూతన వస్త్రాలు, ప్రత్యేక వంటకాలకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేశారు. వివిధ ప్రాంతాల్లో గల ఈద్గాల వద్ద ప్రార్థనల కోసం చేసిన ఏర్పాట్లను పోలీసులు, ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించారు. ప్రజలంతా సోదరభావంతో పండుగను నిర్వహించుకోవాలని నాయకులు, అధికారులు కోరారు. అలాగే ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 11


ఇబ్రహీంపట్నంలో రంజాన్ ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా

విజిలెన్స్ డీజీ రాజీవ్‌రతన్‌కు నివాళి

- భౌతికకాయాన్ని మహేశ్వరం మండలం మ్యాక్ ప్రాజెక్టులోని స్వగృహం నుంచి అంత్యక్రియలకు తరలింపు
- శ్రద్ధాంజలి ఘటించిన మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్, కలెక్టర్


భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న సీఎస్ శాంతికుమారి

మహేశ్వరం, ఏప్రిల్ 10 : తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌రతన్ గుండెపోటుతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని మండలంలోని తుమ్మలూరు పరిధి మ్యాక్ ప్రాజెక్టులోని నివాసంలో ఉంచగా బుధవారం రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతకుమారి, డీజీపీ రవిగుప్తా, రాచకొండ సీపీ తరుణ్ జోషి, ఏసీబీ డీజీపీ సీవీ.ఆనంద్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాజీవ్‌రతన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతదేహాన్ని దహనసంస్కారాల కోసం హైదరాబాద్‌లోని మహా ప్రస్థానానికి తరలించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.


ఎస్వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సిగరెట్లు

నకిలీ సిగరెట్ల స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు

- రూ.2కోట్ల విలువ చేసే నకిలీ సిగరెట్లు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు

శంషాబాద్, ఏప్రిల్ 10 : శంషాబాద్ ఆర్జీఐఏ పరిధి గగన్‌పహాడ్‌లో మంగళవారం నకిలీ సిగరెట్ల స్మగ్లింగ్ ముఠా గుట్టును ఎస్వోటీ పోలీసులు రట్టు చేశారు. రూ.2కోట్ల విలువైన నకిలీ బ్రాండ్ల సిగరెట్లను సీజ్ చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో సంచలనం రేపిన ఈ సంఘటనలో నకిలీ సిగరెట్లు సరఫరా చేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన నలుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన రవికాంత్‌కుమార్(27), మహ్మద్ షాహిద్(36), ముబారిక్ ఖాన్(18), సయ్యద్ ఇలయసుద్దీన్(36), రెహాన్‌ఖాన్(32), రాజు అలియాస్ సుభాష్‌లు ముఠాగా ఏర్పడి డిటర్జెంట్ పౌడర్ సరఫరా ముసుగులో నకిలీ సిగరెట్లను వివిధ రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన ఎస్వోటీ పోలీసులు గగన్‌పహాడ్‌లోని పార్కింగ్ ఏరియాలో తనిఖీలు చేయగా వీరి గుట్టురట్టయ్యింది. ముఠాలోని నలుగురిని అరెస్టు చేయగా రాజు పరారీలో ఉన్నాడు. పూర్తిస్థాయి దర్యాప్తునకు కేసును ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ ముఠా ఏయే ప్రాంతాలకు నకిలీ సిగరెట్లను సరఫరా చేసిందో తెలుసుకునేందుకు రెండు టీంలు రంగంలోకి దిగాయి.

చికెన్ @ 320

ట్రిపుల్ సెంచరీ దాటిన కోడిమాంసం



పెరుగుతున్న చికెన్ రేట్లు మాంసాహార ప్రియులకు షాకిస్తున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా తినే చికెన్ ధరలు రోజుల వ్యవధిలోనే కిలోకు వంద వరకు పెరగడంతో కోడి మాంసం పేదలకు అందకుండా పోతోంది. గత నెల 18న కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.208 ఉంటే ప్రస్తుతం రూ.320కి చేరింది. కోళ్ల ఉత్పత్తి తగ్గడం, రంజాన్ మాసం, పెళ్లిళ్లు ఇతర శుభ కార్యాల్లో వాడకం ఎక్కువై డిమాండ్ పెరిగింది. ఎండ కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ధర పెరిగింది. ఇదో రికార్డని చికెన్ వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే మరి కొన్ని రోజుల్లో కిలోపై మరో 50 రూపాయల వరకు పెరిగే ఆస్కారం ఉందని మార్కెట్ వర్గాలంటున్నాయి. పౌల్ట్రీ ఫారాల్లో ఉత్పత్తి పెరిగితేనే చికెన్ రేట్లు దిగివచ్చే అవకాశం ఉంది.

- మండుతున్న ఎండలు.. మృత్యువాతపడుతున్న కోళ్లు
- తగ్గుతున్న ఉత్పత్తి.. డిమాండ్‌ను అందుకోని సప్లయ్
- రోజురోజుకూ పెరుగుతున్న చికెన్ రేట్లు.. తగ్గిన గుడ్డు ధర
- సామాన్యులకు అందని నాటుకోళ్లు
- భారీ ధరలతో సామాన్యులు సతమతం

(రంగారెడ్డి అర్బన్, ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఎండ కాలంలో చికెన్ ధరలు తగ్గుతాయి. కానీ ఈసారి కోడి మాంసం ధరల పెరుగుదల చికెన్ ప్రియులకు షాకిస్తున్నాయి. ఊహించని విధంగా పెరుగుతున్న ధరలు నాన్‌వెజ్ లవర్స్‌ను కలవరపెడుతున్నాయి. కిలో 320కి చేరింది. పెరిగిన ధరలతో పేదలు, సామాన్యులు చికెన్ కొనలేని పరిస్థితి ఏర్పడుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మనుషులకే కాదు ఇతర జీవులకూ ఇబ్బందిగా మారుతోంది. బ్రాయిలర్ కోళ్లు, నాటుకోళ్లు ఎండ వేడిని తట్టుకోలేక ఎక్కడికక్కడ చనిపోతుండడంతో డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి లేక చికెన్ రేటు అమాంతం పెరుగుతోంది. గత నెల రోజులుగా రంజాన్ సీజన్ కూడా నడుస్తుండడంతో చికెన్ డిమాండ్ కూడా సాధారణం కంటే ఎక్కువే ఉంది. ఇదిలా ఉంటే ఎండల తీవ్రతకు కోడి పిల్లలు చనిపోతాయని కొందరు పౌల్ట్రీషెడ్ల నిర్వాహకులు ఈ రెండు మూడు నెలలు కోళ్ల పెంపకాన్ని నిలిపేస్తారు. ఎండకాలం సీజన్‌లో కనీసం రెండు బ్యాచ్‌ల కోళ్లను పెంచకుండా వదిలేస్తారు. సాధారణంగా సమ్మర్‌లోచికెన్ ధర తక్కువే ఉంటుందని, లాభాలు కూడా అంతంతే అని బ్యాచ్‌లు పెంచరు. కోడి పిల్లలు చనిపోతే పెట్టుబడి మీద పడుతుందనే కారణంతోనూ బ్యాచ్‌లు వదిలేస్తారు. అయితే ఈసారి అనూహ్యంగా ఉత్పత్తి బాగా పడిపోయి ధర పెరుగుతోంది. ఓ వైపు పెళ్లిళ్ల సీజన్, మరో వైపు రంజాన్ పండగ ఉండటంతో చికెన్‌కు డిమాండ్ పెరిగింది. అందుకు తగ్గట్టు ఉత్పత్తి లేకే కోడి మాంసం ధర కొండెక్కింది. ప్రస్తుతం కిలో చికెన్ ట్రిపుల్ సెంచరీ దాటింది. మార్చి 18న కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.208 ఉంటే.. నేడు రూ.320కి చేరింది. 22 రోజుల్లోనే కిలో చికెన్‌పై రూ.112 పెరిగింది. దీంతో రెండు కిలోలు కొనేవారు కిలో, అర కిలో, పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు.

ఎండకు కోడి పిల్లలు చనిపోతున్నాయి



ఎండ తీవ్రతకు కోడి పిల్లలు 20-30శాతం వరకు చనిపోతున్నాయి. వేసవిలో కోడి బరువు కూడా తక్కువే ఉంటుంది. సాధారణంగా ఒక్కోకోడి అమ్మకానికి వచ్చేసరికి 2.5కిలోల బరువు రావాలి. అయితే 2కిలోలే వస్తుంది. కోళ్ల పెంపకం ఖర్చు కూడా పెరిగింది. వాతావరణానికి తగ్గట్టుగా కోళ్లను పెంచాలి. వేసవిలో చల్లదనం కోసం కోసం షెడ్ల వద్ద స్ప్రింక్లర్లు, కూలర్లు ఏర్పాటు చేయాలి. షెడ్ల వద్ద వాతావరణాన్ని చల్లబర్చి కోళ్లు చనిపోకుండా కాపాడుకోవాలి. కరెంట్, నీరు అవసరం. ఏప్రిల్ 26 వరకు పెళ్లిళ్ల శుభకార్యాలున్నాయి. నెల రోజుల పాటు రంజాన్ మాసం నడిచింది. దీంతో చికెన్ డిమాండ్ పెరిగింది. సప్లయ్ తగ్గింది.

- పడాల ప్రభాకర్, పౌల్ట్రీ రైతు, ముడిమ్యాల, చేవెళ్ల మండలం

పడిపోయిన గుడ్డు ధర

కొంత కాలంగా చుక్కలు చూపించిన కోడిగుడ్డు ధరలు ఉన్నంటుండి తగ్గాయి. ఈ నెల 5వ తేదీన 7రూపాయలున్న గుడ్డు ధర ప్రస్తుతం 5కు పడిపోయింది. ఒక గుడ్డు ధర పౌల్ట్రీలో 3.75రూపాయలుంటే అదే గుడ్డు హోల్‌సేల్‌కు వచ్చేసరికి 4రూపాయలకు అమ్ముతున్నారు. రీటైల్ మార్కెట్‌లో ఒక్కో గడ్డు రూ.5కు విక్రయిస్తున్నారు. ఐదు రోజుల్లోనే గుడ్డుపై 2రూపాయలు తగ్గింది. చికెన్ ధర పెరగడం.. గుడ్డు ధర తగ్గటం నాన్‌వెజ్ ప్రియులకు కొంత ఊరటనిచ్చింది. అయితే పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు గుడ్డు తినడం తగ్గిందని, అందుకే గుడ్డు రేటు తగ్గిందని ఎగ్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.

చికెన్ రేటు బాగా పెరిగింది



నాకు చికెన్ ఇష్టం. వారంలో కనీసం రెండు సార్లయినా చికెన్ తినేవాన్ని. కిలోపై వంద వరకు పెరిగింది. ఎండ కాలంలో ఎన్నడూ లేనంతగా చికెన్ రేటు పెరిగింది. అర కిలోతో సరిపెడుతున్నా.

- ఈర్లపల్లి మహేశ్, ఆస్పల్లిగూడ, షాబాద్

రికార్డు స్థాయిలో ధర!

రానున్న రోజుల్లో కోడి మాంసం ధర మరింత పెరిగే ఆస్కారం లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు. మరో వారం వ్యవధిలో చికెన్ కిలోపై 50రూపాయల వరకు పెరిగే ఆస్కారం ఉందని, దీంతో ధర రూ.370 వరకు చేరుకుంటుందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. చికెన్ ధరలు ఇంత ఎక్కువ ఎన్నడూ లేవని, ముఖ్యంగా ఎండకాలంలో ఇంతమేర ధర పెరగడం రికార్డే అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కోళ్ల ఉత్పత్తి పెరిగితేనే ధర తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కాగా మేడ్చల్ జిల్లాలో కోళ్ల ఫారాలు తక్కువగా ఉండటంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. చికెన్ ధరకు రవాణా ఖర్చులూ తోడై రేట్లు అమాంతం పెరుగుతున్నాయి. ఇదిలా ఉంటే నాటుకోడి కిలో రూ.550 వరకు విక్రయిస్తున్నారు. బ్రాయిలర్ ఉత్పత్తి తగ్గిన నేపథ్యంలో నాటుకోడి ధర సైతం మరింత పెరిగే అవకాశం ఉంది.

ఒక గుడ్డు ధర(రూపాయలు)

ఏప్రిల్	ఫాంరేట్	హోల్‌సేల్	రీటైల్
10	3.75	4	5
5	5.24	5.54	7

ధరలు మండిపోతున్నాయి



మార్కెట్‌లో కూరగాయల ధరలతో పాటు మాంసం ధరలూ మండిపోతున్నాయి. కిలో మటన్‌కు గ్రామాల్లో రూ.820 వరకు, పట్టణ ప్రాంతాల్లో 880 దాకా అమ్ముతున్నారు. అంత ధర పెట్టి పేద, మధ్య తరగతి ప్రజలు మటన్ కొనలేరు. అలాంటి వారు చికెన్‌తో సరిపెట్టుకుందామనుకుంటే.. ఇప్పుడు చికెన్ ధర కూడా 320 దాటింది. దీంతో కిలో కొనేవాళ్లం అర కిలోతో సరిపెట్టుకుంటున్నాం.

- బంగారు మాణమ్మ, తుమ్మలపల్లి, చౌదరిగూడెం మండలం

రానున్న రోజుల్లో చికెన్ రేటు మరింత పెరిగే అవకాశం



వారం రోజుల నుంచి చికెన్ ధర పెరుగుతోంది. ఈ నెల 2న విత్‌స్కిన్ కిలో చికెన్ రూ.226, స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.256 విక్రయించాం. ప్రస్తుతం స్కిన్‌తో కిలో రూ.280 విక్రయిస్తున్నాం. అలాగే స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.310 విక్రయిస్తున్నాం. రంజాన్, పెళ్లిళ్ల సీజన్ కావడంతో చికెన్ వాడకం బాగా పెరిగింది.

- యాదగిరిగౌడ్, చికెన్ సెంటర్ యజమాని, కందుకూరు

చికెన్ ధరల వివరాలు

తేదీ	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
ఏప్రిల్ నెలలో..		
10	290	320
06	265	300
05	243	276
03	241	272
02	226	256
మార్చిలో ..		
30	219	248
28	216	244
27	213	241
26	206	233
22	199	225
21	196	222
20	188	213
19	185	210
18	183	208



ఓటును మించిన ఆయుధం లేదు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్.. ఉత్సాహంగా 2కే రన్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 : ఓటును మించిన ఆయుధం లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శేర్లింగంపల్లి జోన్‌లో బుధవారం 2కే రన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. బుల్లెట్ కన్నా బ్యాలెట్ గొప్పదని, ప్రతి ఓటరు విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో 3.3కోట్ల ఓటర్లు ఉన్నారని, ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోకుంటే ఓటు వృథా అవుతుందన్నారు. 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. పౌరులు ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని, సి-విజిల్ యాప్‌ను మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకొని కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేయొచ్చన్నారు. మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. హైదరాబాద్ అన్నింట ముందున్నా, ఓటింగ్ మాత్రం 50శాతానికి మించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. ఓటర్ జాబితాలో పేరు లేని వారు ఈ నెల 15వ తేదీ లోగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకొని ఓటు హక్కు పొందాలన్నారు. మే 13న స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏడు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఆదాయం, చదువుల్లోనే కాదు, సామాజిక బాధ్యతలోనూ ముందున్నామని నిరూపించుకోవాలన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, ఓటర్ సర్వీస్ పోర్టల్‌లో ఓటర్లు వివరాలను చెక్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. 2కే రన్‌లో విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహశబరీష్, ఏసీపీ, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా సాగిన 2కే రన్

ఓటు హక్కు ప్రాముఖ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు స్వీప్‌లో భాగంగా కొండాపూర్ బొటానికల్ గార్డెన్ నుంచి హైటెక్స్ రోడ్ మెటల్ చార్మినార్ వరకు 'ఐ ఓట్ ఫర్ షూర్' నినాదంతో నిర్వహించిన 2కే రన్ ఉల్లాసంగా సాగింది. అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్, ట్రాన్స్‌జెండర్లు, యువత, దివ్యాంగులు, వాకర్స్ అసోసియేషన్లు, సైకిలిస్ట్ అసోసియేషన్స్, పోలీసులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో 2కే రన్‌లో పాల్గొన్నారు. ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు.


2కే రన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

బాబోయ్.. ఎండలు మండుతున్నాయి!

మౌలాలిలో అత్యధికంగా 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 : ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం నడినెత్తిన సూర్యుడు సుర్రుమంటున్నాడు. బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. ఉష్ణోగ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వ్యాపారులు, ప్రయాణికులు, వాహనదారులు ఉక్కపోత, ఎండ వేడిమితో సతమతమవుతున్నారు. మధ్యాహ్నం పూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ సమయంలో సాధ్యమైనంత వరకు బయటకు రావొద్దని, అత్యవసరమై బయటకు వస్తే గొడుగు, టోపి వంటివి ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా మౌలాలిలో అత్యధికంగా 40.2డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 40 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లాలో 39.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

పేదలకు అండగా బీజేపీ ప్రభుత్వం

కులకచర్ల, ఏప్రిల్ 10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ.272 నుంచి రూ.300 వరకు పెంచిందన్నారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని ఘనపూర్ గ్రామంలో ఉపాధి కూలీలు బుధవారం నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి రావాలంటే చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్, పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు షైపాల్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మీ గోపాల్‌గౌడ్, నాయకులు రామచంద్రయ్య, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, కూలీలు

కాంగ్రెస్ పార్టీ.. మాదిగల ద్రోహి

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు రూరల్, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి అని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ ఆదేశాల మేరకు బుధవారం తాండూరులో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మల్లికార్జున్ మాట్లాడుతూ తెలంగాణలో 70 లక్షలకుపైగా జనాభా ఉన్న మాదిగలకు పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఒక్కస్థానం కూడా కేటాయించలేదన్నారు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో 4శాతం లేని రెడ్డీలకు 6 స్థానాలు కేటాయించి, 50శాతం పైగా ఉన్న బీసీలకు 2 స్థానాలు, 12శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా లేకుండా చేయడం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ద్రోహం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో మల్లు, గడ్డం వివేక్ కుటుంబానికి ఉన్న విలువ.. మాదిగ జాతికి లేదని, అందుకు వారికి కేటాయించిన స్థానాలే సాక్ష్యమని అన్నారు. ఎంపీ స్థానాల్లో మాదిగలకు ఒక్కసీటు కూడా కల్పించని రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పది రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షులు పి.నర్సింహులు మాదిగ, బి.కృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్, ఎంఎస్ఎఫ్ జిల్లా కో-కన్వీనర్ ఉమాశంకర్, జిల్లా కార్యదర్శి మహేందర్, ఎంఎస్ఎఫ్ మండల కన్వీనర్ వెంకట్, ఎమ్మార్పీఎస్ తాండూరు మండలాధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

'స్ట్రాంగ్‌రూం' వద్ద భారీ బందోబస్తు

తాండూరు, ఏప్రిల్ 10: మే 13 నిర్వహించే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాండూరుకు వచ్చిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూం వద్ద పోలీసు పారా మిలటరీ బృందంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈమేరకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. బుధవారం తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ తారాసింగ్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.



సీఎంకి తమ సమస్య గురించి వివరిస్తున్న 2008 డీఎస్సీ అభ్యర్థులు

మాకు న్యాయం చేయండి సార్

సీఎం రేవంత్‌కు 2008 డీఎస్సీ ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థుల విజ్ఞప్తి

వికారాబాద్/తాండూరు, ఏప్రిల్ 10 : 2008 డీఎస్సీలో అర్హత సాధించిన తమకు ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 2008 డీఎస్సీలో అర్హత సాధించిన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేశారు. 2008 డీఎస్సీలో ప్రభుత్వ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం కల్పించారని, తమకూ అవకాశం ఇవ్వాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ డీఎస్సీలో ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో డీఎస్సీలో తమకు అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించామని చెప్పారు. న్యాయస్థానం ఉత్తర్వులతో తాము 2008 డీఎస్సీ పరీక్ష రాశామని, సెలెక్షన్ జాబితాలో, మెరిట్ జాబితాలో తమ పేర్లు ఉన్నాయని, ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కూడా జరిగిందని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయస్థానం ఆదేశాలతో డీఎస్సీ పరీక్ష రాసి ఎంపికైన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విత్‌హెల్డ్‌లో ఉంచి అప్పటి ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందన్నారు. న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా.. తాము ఉద్యోగాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని 2008 డీఎస్సీ అభ్యర్థులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసిన వారిలో 2008 డీఎస్సీ అభ్యర్థులు రఘు, రాంప్రసాద్, కిషోర్, అశోక్, రవి, శ్రీనివాస్, కరుణాకర్, సునీత, అనంతలక్ష్మి, లత పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి

చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ▸ శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల్లో పర్యటన

చేవెళ్ల, ఏప్రిల్ 10 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశ కీర్తి ప్రతిష్ఠలు గణనీయంగా పెరిగాయని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా బుధవారం శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడ, గాజులగూడ, దోబిపేట్, అలంకాన్‌గూడ, పత్తేపూర్, బుల్కాపూర్, మోకిల, ప్రొద్దుటూర్ గ్రామాల్లో పర్యటించారు. అలాగే సాయంత్రం చేవెళ్ల మండలం ఎన్కెపల్లి, ఆలూర్, మీర్జగూడ, బస్తేపూర్, చనువల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... యావత్ దేశం నరేంద్రమోదీ వెంటే నడుస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభంజనాన్ని ఎదుర్కొలేకే కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కేరళ పారిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. రైతులకు 2లక్షల రుణ మాఫీ చేయలేదని, వృద్ధులకు పింఛన్ పెంచడం లేదన్నారు. రైతులకు బోనస్ ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. తనను చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం పాటుపడతానన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించి బీజేపీకి పట్టంకట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ నర్సింలు, నాయకులు సురేశ్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, రవి, జంగారెడ్డి, వెంకటేశ్, లక్ష్మారెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న గ్రామస్థులు

తాగునీటి సరఫరాకు పకడ్బందీ చర్యలు

▸ వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 10 : తాగునీటి సరఫరాకు అన్నిరకాల చర్యలు తీసుకున్నట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి తాగునీటి సరఫరాపై ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, ప్రతీ గ్రామానికి తాగునీటి సరఫరా చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. వడదెబ్బ తగిలినవారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆశావర్కర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్, డీపీవో జయసుధ, డీఈవో రేణుకదేవి, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి, డీఎంహెచ్‌వో పాల్వాన్ కుమార్, మిషన్ భగీరథ ఈఈలు బాబు శ్రీనివాస్, చల్మా రెడ్డి, డీఈలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బీఆర్ఎస్‌కు భారీ షాక్

200మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక

కందుకూరు, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు భారీషాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 200 మంది కార్యకర్తలు, నాయకులు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) సమక్షంలో తుక్కుగూడలోని ఆయన చాంబర్‌లో కాంగ్రెస్‌లో చేరారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు మనమంతా పనిచేయాలన్నారు. బాచుపల్లి, ధన్నారం, వావిళ్లకుంట తండా, బేగరికంచ గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో కొత్త, పాత తేడా లేకుండా అందరినీ కలుపుకొని పోయి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ టి.అనితాహరినాథ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యులు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, పీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్, నాయకులు బుక్క ప్రశాంతిపాండురంగారెడ్డి, ఎం.శేఖర్‌రెడ్డి, సాయిలు, పాండుగౌడ్, హన్మంతరెడ్డి, ఢిల్లీ శ్రీధర్, కొలను విఘ్నేశ్వర్‌రెడ్డి, రూప్లానాయక్, పర్వతాలు, మట్ట మల్లయ్యగౌడ్, మంద నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

రామమందిరం నమూనాకు ప్రపంచస్థాయి గుర్తింపు

▸ ప్రెస్టీజియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అశోక్‌కు చోటు

దౌల్తాబాద్, ఏప్రిల్ 10: కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం యాంకి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ సున్నపు అశోక్ చిత్రకళలో సిద్ధహస్తుడు. తన కళానైపుణ్యంతో మరో అరుదైన ఘనత సాధించాడు. ఇటీవల అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో 2000 ఐస్‌క్రీమ్ పుల్లలతో రోజుకు గంటపాటు శ్రమించి మొత్తం 20 రోజుల వ్యవధిలో రామమందిరం రూపకల్పన చేసి కళాభక్తిని చాటిన విషయం విదితమే. ఐస్‌క్రీమ్ పుల్లలు, సొప్ప బెండ్లు, టూత్ పుల్లలతో మనదేశంలో ప్రసిద్ధిగాంచిన పలు చారిత్రాత్మకమైన మందిరాలు, అద్భుత కట్టడాలను తయారు చేస్తూ ప్రతిభ చాటుతున్నాడు. ఈసందర్భంగా అశోక్ తయారుచేసిన రామమందిరంపై ప్రెస్టీజియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన ప్రెస్టీజియస్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ వారు వివిధ సామాజిక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వ్యక్తులను గుర్తించి రికార్డులతో పట్టం కడతారు. ఈ నేపథ్యంలో అశోక్ తయారు చేసిన అయోధ్య రామమందిరం నమూనాపై వరల్డ్ రికార్డుగా పరిగణలోకి తీసుకొని ఫౌండర్ సీఈవో హర్షిత్ బాజ్‌పాయ్ ప్రెస్టీజియస్ వరల్డ్ రికార్డ్ ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్ వేదికగా అందించినట్లు అశోక్ తెలిపారు. అశోక్ ఈ ఘనత సాధించడంతో తల్లిదండ్రులు, బంధువులు, తోటి స్నేహితులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చిత్రకారుడు అశోక్ తయారు చేసిన రామమందిరం నమూనా

వేర్వేరు పాఠశాలల్లో ముగ్గురు విద్యార్థినులకు అస్వస్థత

▸ ఆస్పత్రిలో చేరిక..

▸ హాస్టల్‌లో భోజనం సరిగా లేదని తల్లిదండ్రుల ఆరోపణ

తాండూరు రూరల్, ఏప్రిల్ 10 : వేర్వేరు పాఠశాలల్లో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారికి వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తాండూరు మండలం చెన్‌గేష్‌పూర్ మార్గంలోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో సుమిత్ర, మౌనికలు ఐదో తరగతి చదువుకుంటూ వసతి గృహంలో ఉంటున్నారు. బుధవారం రాత్రి వారికి కడుపునొప్పి రావడంతో ఇద్దరినీ తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మౌనికను కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా, వసతి గృహంలో సరైన సౌకర్యాలు లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యతలేని భోజనం, కలుషిత నీటివల్ల అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. హాస్టల్‌లో తగిన సౌకర్యాలు లేక ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని విద్యార్థులు తెలిపారు.



తాండూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

మరో సంఘటనలో..

తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన అలేఖ్య జినుగుర్తి గేటు సమీపంలోని కేజీబీవీలో 6వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. నాలుగు రోజులుగా అలేఖ్య కడుపునొప్పితో బాధపడుతోంది. ప్రైవేటు ఆసుపత్రితోపాటు జిల్లా ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించారు. కాగా, అలేఖ్య రక్తహీనతతో బాధపడుతోందని, మెరుగైన వైద్యం కోసం నీలోఫర్‌కు వైద్యులు రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేజీబీవీలో నాణ్యత లేని భోజనం, కలుషిత వాతావరణం వల్ల బాలికలు తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తల్లిదండ్రులు తెలిపారు. కేజీబీవీ సమీపంలో జిప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసనతో వారం రోజుల క్రితం పలువురు విద్యార్థినులు దగ్గు, దమ్ముతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురై హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లిపోయిన సంఘటనలున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ ఉన్నతాధికారులు హాస్టళ్లను తనిఖీ చేయకపోవడంతో స్థానికంగా ఉన్న అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



కొమరబండలో ధ్వజారోహణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం

షాబాద్, ఏప్రిల్ 10 : మండల పరిధి కొమరబండలో శ్రీబుగ్గరామేశ్వరస్వామి ధ్వజారోహణం, రుద్రాభిషేకం బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. కొమరబండ నుంచి బుగ్గరామేశ్వరస్వామి ఆలయం వరకు భక్తులు భజనలు, కోలాటాలతో ఆలయానికి చేరుకొని ధ్వజారోహణం నిర్వహించారు. వారం రోజులు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు.

కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలి

ఎంపీ రంజిత్‌రెడ్డి ● కాంగ్రెస్ పార్టీలో మాజీ సర్పంచ్‌ల చేరిక



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ సర్పంచ్‌లు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ ఒక్క కార్యకర్త కృషిచేయాలని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేందర్ అధ్వర్యంలో మల్కారం మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, మాధవియాదగిరిరెడ్డి, విండో మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగయ్య, మరో 200మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలంటే ప్రతీ కార్యకర్త కృషిచేయాలని కోరారు. మన రాష్ట్రం, ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఢిల్లీలో మన వాణి విన్పించేందుకు చేవెళ్ల ఎంపీ స్థానంలో కాంగ్రెస్ విజయం సాధించాలన్నారు. గతంలో ఎంపీగా ఉన్నపుడు వందల కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానాన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహేందర్, కోటేశ్వర్‌గౌడ్, జీవన్‌గౌడ్, ఫక్రుద్దీన్, రఫీక్, సిద్దేశ్వర్, చంద్రశేఖర్, సురేష్, జిల్లా అనంద్, ప్రభాకర్, ఆంజనేయులు, మల్లికార్జున్ పాల్గొన్నారు

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఆరు గ్యారంటీలు పక్కా

శంషాబాద్ రూరల్: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే అర్హులైన ప్రతి కుటుంబానికి ఆరు గ్యారంటీ పథకాలు పక్కాగా అందేలా తాము చర్యలు తీసుకుంటామని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు సభ్యురాలు సీతారెడ్డి అన్నారు. ఆమె శంషాబాద్ మండలం నర్కూడ, చౌదరిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు నర్కూడలో గల శ్రీసీతారామస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి తన భర్త రంజిత్‌రెడ్డిని ఎంపీగా మరోసారి గెలిపించాలని కోరారు. ప్రగతి కోసం పాటుపడే వ్యక్తి రంజిత్‌రెడ్డి అన్నారు. ప్రచారం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మహాలక్ష్మి పథకం కింద ప్రతి పేద కుటుంబంలో మహిళలకు నెలనెలా రూ.2,500 ఇచ్చి ఆదుకుంటామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామని, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా, చేయూత, యువ వికాస్ పథకాలతో పేదలకు లబ్ధి కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేక విపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఆమె వెంట రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, ఎంపీటీసీ గౌతమి తదితరులు ఉన్నారు.



నర్కూడలో ఓటర్లకు నమస్కరిస్తున్న రజింత్‌రెడ్డి సతీమణి సీత

రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించి ఆదరించండి

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీత

మహేశ్వరం, ఏప్రిల్ 10 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి అయిన తన భర్త రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రంజిత్‌రెడ్డి సతీమణి సీత ప్రజలను కోరారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ 15వ వార్డులో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించిన ఆమె ఓటర్లకు తమ గుర్తును చూపిస్తూ ఓట్లు అభ్యర్థించారు. తన భర్త గత ఐదేళ్లుగా ఎంపీగా ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి, సంక్షేమాలపై వివరించారు. ఈ సారి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం అన్నారు. మరో సారి రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించి చేతి గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో పీసీసీ కార్యదర్శి గోగికార్ జానకిరామ్, తుక్కుగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ తేజశ్వినిశ్రీకాంత్, మాజీ సర్పంచ్ దేవరాయసుధాకర్, రాజేందర్, పద్మభాస్కర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




తుక్కుగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీత

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్


కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 : రంజాన్ పండగ సందర్భంగా కలెక్టర్ శశాంక, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండుటెండల్లోనూ ఎంతో నియమనిష్ఠలతో నెల రోజుల పాటు ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు నిర్వర్తించడం గొప్ప విషయమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ, సంతోషాలతో జీవించాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నెల రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమైన ముస్లిం సోదరులు, అదే స్ఫూర్తితో గురువారం నాటి ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌ను కూడా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని వారు సూచించారు.

కారు దిగనున్న వైస్ ఎంపీపీ 'జక్కు'


అనంతరెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 10 : ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఆకుతోటపల్లి ఎంపీటీసీ మంగమ్మనారాయణ, మరో ఎంపీటీసీ బీఆర్ఎస్‌కు రాంరాం చెప్పనున్నారు. బీఆర్ఎస్ రోజురోజుకు బలహీనపడుతుండడం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు, ప్రజాపాలనకు ఆకర్షితులై వారు కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించున్నట్లు సమాచారం. ఇప్పటికే వారు కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మల్లు రవి, స్థానిక కాంగ్రెస్ నాయకులతో చర్చించిన్ను తెలిసింది. ఈ నెల 14న ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు సమాచారం. మండలంలో 5 ఎంపీటీసీలకు బీఆర్ఎస్‌లో ఇక ఒక్కరే మిగులనున్నారు. మాజీ సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నట్టు తెలుస్తోంది.

కాంగ్రెస్ చేరిన బీఆర్ఎస్ నాయకులు


కాంగ్రెస్ చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10 : ఇబ్రహీంపట్నంకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాల్ల మహేష్ గౌడ్, కేవీ రమేష్‌రాజు, వర్తక సంఘం నాయకులు నెల్లి కుమారప్పలు తమ అనుచరులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని భావించే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు.

ఉపాధి బిల్లులు విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10: ఉపాధి కూలీలకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిలుల్లను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పి.జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మకు వినతి పత్రం అందజేశారు. ఏడాదికి 200 రోజులు పని కల్పించాలన్నారు. రోజుకు కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు జంగయ్య, గణేష్, రమేష్ తదితరులున్నారు.

హక్కుల కోసం నిరంతరం పోరాటం

చేవెళ్ల, ఏప్రిల్ 10 : కార్మికుల హక్కుల సాధన కోసం ముందుండి పోరాటం చేస్తామని తెలంగాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్కి భీమ్రాజ్ అన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికులు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు సకాలంలో వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోచయ్యగౌడ్, రవికుమార్, బంగారు రాజు, సంపత్‌కుమార్‌గౌడ్, నరేందర్, జహంగీర్, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

దళారి వ్యవస్థను నిర్మూలించడమే లక్ష్యం

తలకొండపల్లి, ఏప్రిల్ 10 : దళారి వ్యవస్థను నిర్మూలించి, రైతులకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సహకారంతో, పౌరసరఫరాల శాఖ సహకారంతో పొద్దు తిరుగుడు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూన రవితో కలిసి కేశవరెడ్డి ప్రారంభించారు.

ఘనంగా బీజేపీ నాయకుడి జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న లక్ష్మణ్, తదితరులు

ఆమనగల్లు, ఏప్రిల్ 10 : ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్, బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు చెక్కాల లక్ష్మణ్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి వగ్గు ప్రభాకర్ జన్మదిన వేడుకలను వారి అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్‌లతో కలిసి వారు కేక్‌కట్ చేశారు.

పాఠశాలల బలోపేతానికి 'అమ్మ' కమిటీలు


అమ్మ కమిటీల చైర్‌పర్సన్‌లతో ప్రధానోపాధ్యాయులు

కొత్తూర్, ఏప్రిల్ 10 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసిందని స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంగోర్‌నాయక్ చెప్పారు. ఆ పాఠశాల ఆవరణలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాల నూతన చైర్‌పర్సన్లకు బుధవారం అవగహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంగోర్‌నాయక్ మాట్లాడుతూ ఎస్ఎంసీ కమిటీ స్థానాల్లో ప్రభుత్వం నూతనంగా అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిందని చెప్పారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించేందుకు చైర్‌పర్సన్లు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై అవగహన కల్పించారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 'అమ్మ' కమిటీల చైర్‌పర్సన్లు పాల్గొన్నారు.

కొందుర్గు : మహిళా సంఘాల గ్రామ కమిటీ అధ్యక్షులే అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లుగా ఉంటారని ఎంఈవో కిష్టారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘాల గ్రామ కమిటీల అధ్యక్షురాళ్లకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల చైర్మెన్లుగా వివిధ గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు ఉంటారని, వీరితో పాటు మరో ముగ్గురు విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. ప్రతి పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కోసం మహిళా సంఘాల గ్రామ కమిటీల అధ్యక్షురాళ్లను నామినేట్ చేయడం జరిగిందని వివరించారు. ఆ కమిటీ చైర్మెన్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జాయింట్ బ్యాంక్ అకౌంట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల యూనిఫాం కోసం టైలర్లు విద్యార్థుల కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో డీపీఎం నర్సింహ్మ, ఏపీఎం జయమాలిని, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం


ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆమనగల్లు, ఏప్రిల్ 10 : ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ పౌరుడు వినియోగించుకోవాలని ఆమగనల్లు మున్సిపల్ కమిషనర్ వసంత చెప్పారు. ఓటు విలువను ప్రతీ ఒక్కరు గుర్తించి మసులు కోవాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వీప్ ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ వసంత ర్యాలీని ప్రారంభించగా మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ చౌక్ వద్ద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకుంటామని కమిషనర్ ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రతీ ఒక్కరు పోలింగ్‌లో పాల్గొని పోలింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. నిర్భయంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేలా ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఏఈ బుచ్చయ్య, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

● అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్


రికార్డులను పరిశీలిస్తున్న రామ్‌కుమార్

ఆమనగల్లు , ఏప్రిల్ 10 : ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, బాధితులతో పోలీసులు మరాద్యదగా నడుచుకోవాలని శంషాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ అన్నారు. ఫిర్యాదులపై సత్వరం స్పందించడం వల్ల పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందించాలని ఆయన చెప్పారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను బుధవారంర ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పాత కేసుల వివరాలను సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ బాల్‌రామ్ నాయక్‌లను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అధికారులు, తదితరులు ఉన్నారు.

13న జరగబోయే సభకు భారీగా తరలిరావాలి

మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డి


మహేశ్వరం : మాట్లాడుతున్న సబితారెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 10 : ఈ నెల 13న చేవెళ్లలో జరిగే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు మహేశ్వరం నుంచి పార్టీ కార్యకర్తలు తరలిరావాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్ర మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లిలో బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న చేవెళ్లలో భారీ బహిరంగ సభ ఉంటుందని దీనికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజునాయక్, నాయకులు మల్లేష్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రయ్య, నవీన్, శివారెడ్డి, రాయప్ప, బి. నర్సింహ్మాయాదవ్, పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

కందుకూరు : బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నేడు(గురువారం) నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహ్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం ఉదయం 10:30 గంటలకు కొత్తూరు గేటు సమీపంలోని పెద్దమ్మ అనేగౌని అంజయ్యగౌడ్ ఫాం హౌజ్‌లో సమావేశం జరుగుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పార్టీ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

తెలంగాణలో బీఆర్ఎస్ శకం ముగిసింది

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాకేష్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, తదితరులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10 : తెలంగాణలో బీఆర్ఎస్ శకం ముగిసిందని, పోటీ కాంగ్రెస్, బీజేపీల మధేనని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేషరెడ్డి, బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కేంద్రంలో మరో మారు రాబోయేది నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వమేనని, అందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్ల మోదీ ప్రభుత్వంలోనే భారత్‌కు ప్రపంచంలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో ప్రజల ముందుకు వచ్చిందని, వంద రోజుల్లోనే వీటిని అమలు చేస్తామని చెప్పినా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మినహా మిగతా హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీజేపీకి మెజార్టీ వస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, దళిత మోర్చా అధ్యక్షుడు కొప్పు బాష, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఎన్ను యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు దండె శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

జైపాల్‌ను కలిసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


జైపాల్‌ను సత్కరిస్తున్న ఆరెస్పీ

ఆమనగల్లు, ఏప్రిల్ 10 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కల్వకుర్తిలో 35 వేల మెజార్టీ వచ్చిందని, ఈ సారి మరింత మెజార్టీ సాధించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, కేశవరావు తదితరులున్నారు.

వేలంలో మాల్ సంతకు భారీ ఆదాయం

యాచారం, ఏప్రిల్ 10 : వేలం పాటలో యాచారం మండలంలోని మాల్ సంతకు భారీ ఆదాయం వచ్చింది. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించగా హోరాహోరీగా జరిగిన పోటీలో యాదాద్రి జిల్లా నార్కట్‌పల్లికి చెందిన ఆంజనేయులు రూ.75,55,300కు సంతను దక్కించుకున్నారు. తైబజార్‌ను మాల్ గ్రామానికి చెందిన గుడుగుండ్ల కృష్ణ రూ.1,16,700లకు దక్కించుకున్నారు. మాల్ సంత ఏర్పడినప్పటి నుంచి ఇంత భారీగా ఆదాయం రావడం ఇదే మొదటిసారని పంచాయతీ అధికారులు చెప్పారు.

అంబలి కేంద్రం ఏర్పాటు


అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

శంషాబాద్ రూరల్ ఏప్రిల్ 10 : మున్సిపల్ పరిధి 11వ వార్డులో కౌన్సిలర్ పారేపల్లి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో సామాన్య ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో అంబలి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో ప్రవీణ్‌గౌడ్, మాజీ సర్పంచులు అంజయ్యగౌడ్, బక్క రత్నం, ప్రసాద్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్,శేఖర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, శేఖర్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : మండల కేంద్రంలో నందిగామ మాజీ సర్పంచ్ వంకాయల రాంరెడ్డి తన తల్లి వంకాయల కౌసల్య దేవి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుదవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయనను పలువురు ప్రశంసించారు.

క్యామ మల్లేష్‌ను గెలిపించాలి


మాట్లాడుతున్న రమేష్, తదితరులు

మంచాల, ఏప్రిల్ 10 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మంచాల మండల అధ్యక్షుడు చీరాల రమేష్,ఎంపీపీ జాటోత్ నర్మదలచ్చిరాం పిలుపునిచ్చారు. బుధవారం బీఆర్ఎస్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తిగా మల్లేష్ గుర్తింపు పొందారని చెప్పారు. ఈ నెల 12న బొంగులూరు ప్రమిద గార్డెన్స్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అన్ని గ్రామాల ముఖ్య కార్యకర్తలందరూ సమావేశానికి హాజరుకావాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి బహదూర్, ఏర్పుల చంద్రయ్య, బుస్సు పుల్లారెడ్డి, జంబుల కిషన్‌రెడ్డి, రఘుపతి, ఉన్నారు.

ఇబ్రహీంపట్నం : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ ఆరోపించారు. సమావేశంలో ఎంపీపీ కృపేష్, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, మంగల్‌పల్లి ప్యాక్స్ చైర్మన్ మహేందర్ రెడ్డి, నాయకులు మొద్దు అంజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో ముస్లింలు

● కేశంపేట ఏప్రిల్ 10 : మండల పరిధిలోని బైర్కన్ పల్లి గ్రామంలో బుధవారం రాత్రి ముస్లిం సోదరులకు మాజీ సర్పంచ్ సభావత్ రూప్లా నాయక్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.

సంక్షిప్తంగా..

యాచారం, ఏప్రిల్ 10 : యాచారం మండలంలోని నందివనపర్తిలో నేటి నుంచి ఈనెల 14 వరకు జిల్లా స్థాయి మెన్స్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జైభీమ్ ఎడ్యుకే టెడ్ యూత్ అసోసియేషన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.350 ఎంట్రీ ఫీజు చెల్లించి, 7780598551, 7337488307 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కేశం పేట : మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన రాంబాయి ఇటివల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి బుధవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బీస కరుణాకర్‌రెడ్డి పరామర్శించి నగదు, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ భీమయ్య, పాల్గొన్నారు.

కొత్తూర్ : హైదరాబాద్ ఎల్బీ నగర్ క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు పలు సదుపాయాలు ఏర్పాటు చేయడంలో క్లాస్‌మేట్ క్లబ్ ముందుకు రావడం అభినందనీయమని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అంగోర్‌నాయక్ అన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోప్యానాయక్, క్లాస్‌మేట్ క్లబ్ సభ్యురాలు పుణ్యవతి, డీవీ పద్మజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచాల : బీఆర్ఎస్ రాష్ట్ర నేత డబ్బీకార్ శ్రీనివాస్ మాతృమూర్తి డబ్బీకార్ లక్ష్మీబాయి(84) అనారోగ్యంతో మృతిచెందగా తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి బుధవారం ఆరుట్లలోని శ్రీనివాస్ నివాసానికి చేరుకుని పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాలరమేష్, చిందం రఘుపతి, ఉన్నారు.

తలకొండపల్లి : మండల పరిధిలోని మాదాయిపల్లి గ్రామానికి చెందిన బాలనాగమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి పరామర్శించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన చుక్కగుట్ట తండాకు చెందిన మల్లేశ్ కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు.

కడ్తాల : మండలం మైసిగండి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బుధవారం బాలపూర్ మండలం అల్మాస్‌గూడకు చెందిన చంద్రారెడ్డి ఇందిరా, నవకిశోర్ రెడ్డి శిరీష దంపతులు వారి కుమారుడు సుధీర్ రెడ్డి స్మారకార్థం మిఠాయిలు, భోజనాన్ని ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్, వార్డెన్ బాల్‌రాజ్, పాల్గొన్నారు.

తలకొండపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలం పరిధిలోని సంగాయిపల్లి గ్రామానికిచెందిన దివాకర్‌రెడ్డి ని బుధవారం తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దివాకర్ రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. నాయకులు తిరుపతి, ఉదయ్‌శంకర్, సంపత్‌కుమార్, తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

కంటైనర్ ఢీ కొని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 10 : కంటైనర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో జరిగింది. ఫరూఖ్‌నగర్‌లోని మహమూద్ కాలనీకి చెందిన మహ్మద్ అబ్దుల్ సలీం(49) షాద్‌నగర్ చౌరస్తా నుంచి ఫరూఖ్‌నగర్ వైపు నడుచుకుంటూ వస్తుండగా హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళుతున్న ఓ కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో సలీం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు కలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాంచంద్రయ్య తెలిపారు.

మోటర్ బైక్‌ల దొంగల రిమాండ్

కందుకూరు, ఏప్రిల్ 10 : కందుకూరు-యాచారం మండలాల్లో తరుచూ మోటార్ వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను బుధవారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కందుకూరు సీఐ మక్బూల్‌జాని తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు రెండు ద్విచక్రవాహనాలపై అనుమానంగా ప్రయాణిస్తున్నట్లు గుర్తించి వారిని తనిఖీ చేయడం జరిగిందన్నారు. వారు టీఎస్07 హెచ్ఎస్ 0356 నెంబర్ గల ఒక పల్సర్ బైక్, టీఎస్ 07ఎఫ్ హెచ్ 2963 నెంబర్ గల స్ప్లెండర్ బైక్‌పై ప్రయాణిస్తున్నారని చెప్పారు. వారి వద్ద ఎలాంటి కాగితాలు, లేకపోవడంతో తమ సిబ్బందికి వారిపై అనుమానం రావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారిని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ గ్రామానికి చెందిన తెపర్ల భీమేష్(24) కొత్త యాదయ్య అలియాస్ యాదగిరి(20), ఓ మైనర్ బాలుడు(17) కలిసి కొన్ని నెలలుగా కందుకూరు, యాచారం మండలాల్లో సంచరిస్తూ ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు, మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు సీఐ మక్బూల్‌జానీ తెలిపారు.

పెట్రోల్ దొంగ అరెస్ట్

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 10 : ఇళ్ల ముందు పార్క్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలించిన ఓ దొంగను అరెస్ట్ చేసినట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తెలిపారు. ఈ నెల 6న నెహ్రూ నగర్ కాలనీకి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌ను ఇంటి ముందు పార్క్ చేసి ఉండగా అదే రోజు మధ్య రాత్రి తెల్లపల్లి గణేష్‌కుమార్, మరో ఇద్దర వ్యక్తులు బైక్ నుంచి పెట్రోల్ దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా గణేష్ దొంగిలించినట్లు తేలిందని అన్నారు. బుధవారం గణేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

షాపింగ్‌కు వెళుతున్నట్లు చెప్పి.. వ్యక్తి అదృశ్యం


జయలాల్‌కర్సర్నే

శంషాబాద్‌రూరల్ 10 : షాపింగ్‌కు వెళుతున్నట్లు కంపెనీ నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలోని రషీద్‌గూడలో చోటు చేసుకుంది. శంషాబాద్ పోలీసుల కథనం మేరకు రషీద్‌గూడలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న జయలాల్‌కర్సర్నే(50) అనే వ్యక్తి మహారాష్ట్రలోని బాలాఘాట్ నివాసి, కొంత కాలంగా రషీద్‌గూడలోని కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2న మధ్యాహ్నం విధులు నిర్వహిస్తుండగా షాపింగ్‌కు వెళుతున్నట్లు తన సహచర ఉద్యోగులకు చెప్పి కంపెనీ నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి కంపెనీలోకి రాకపోవడంతో అతని సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు వెతికినా అతని జాడ తెలియలేదు. కంపెనీ నిర్వాహకుడు వినయ్‌సాగర్ బుధవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయలాల్‌కర్సర్నే 5.1 అడుగు ఎత్తు ఉండి, తెలుపు రంగు చొక్కా, ప్యాంట్ ధరించాడని చెప్పారు. అతను మరాఠీ, హిందీ మాట్లాడతాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

భారత తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణదాసు, మణెమ్మ

షాబాద్, ఏప్రిల్ 10 : భారత దేశ తొలి ఉపాధ్యాయురాలు, కులవ్యవస్థకు చమరగీతం పాడిన సావిత్రిబాయి పూలేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అంబేద్కర్, పూలే అవార్డు గ్రహీత నారాయణదాసు, సావిత్రిబాయిపూలే జాతీయ అవార్డు గ్రహీత మణెమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పాఠాలు చెప్పిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ వాచ్య, విద్యా కమిటీ చైర్మన్ గూడూర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ దీపిక, నాయకులు జంగయ్య, క్రిష్ణ, యాదయ్య, పాండు, నర్సింహులు, శివ, రమేష్, జైరాం, ఉపాధ్యాయులు రబీయ బేగం, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 10 : తెలంగాణలో 70 లక్షలకు పైగా జనాబా ఉన్న మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని, లోకసభ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింలు, శివశంకర్ మాదిగ, శంకర్‌పల్లి, డప్పు శ్రీకాంత్ మాదిగ, మహేందర్, రాజు, ఉన్నారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తూర్, ఏప్రిల్ 10 : వడ్డెరులకు కార్పొరేషన్ చేయించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను క్యాంపు కార్యాలయంలో వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్టు నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటుకు తమ వంతు చొరవ చూపాలని ఎమ్మెల్యేను వారు కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకపోతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని ఆ సంఘం నాయకులు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దండుగుల వెంకటరమణ, నాయకులు హన్మంతు, ఉన్నారు.

12 నుంచి గురు మందిర స్వర్ణోత్సవాలు

చేవెళ్ల, ఏప్రిల్ 10 : మండల పరిధి గొల్లగూడలో గల శ్రీ సాందీప అచల బుషి పరిపూర్ణ గురు మందిర స్వర్ణోత్సవాలను ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తామని మందిర వ్యవస్థాపకులు దయానంద నాగుల వెంకటేశం తెలిపారు. బుధవారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ 12, 13 తేదీల్లో ప్రభాత సేవ, గీతా పారాయణం, నగర సంకీర్తన, అచల గురు జెండా ప్రతిష్ఠ పూజలను మదచల గురుపీఠ రాజయోగాశ్రమ అనుబంధ పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమాలకు తెలుగు, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి, జెడ్పీటీసీ మాలతి, బీజేపీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డిలకు ఉత్సవాల ఆహ్వాన ప్రతికలు అందజేశారు.